# సాక్షి
## శ్రీకాకుళం

శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023




### ఆట అదరహో

ఎస్‌పీఎల్‌లో ఆటగాళ్లు అదరగొడుతున్నారు. మ్యాచ్‌లు ఉత్సాహంగా సాగుతున్నాయి.

- 8లో



### 'ఉపాధి' పనుల పరిశీలన

ఉపాధి పనులను జాతీయ బృందం పరిశీలించింది. బృంద సభ్యులు అధికారులతో సమీక్షించారు.

- 8లో

### ఆర్‌ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి

అరసవల్లి: జిల్లాలో గ్రామీణ వైద్యుల (ఆర్‌ఎంపీ) సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేస్తానని జిల్లా సంఘ అధ్యక్షుడు సీహెచ్ ఉమామహేశ్వరరావు అన్నారు. విశాఖపట్నంలో గురువారం జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సంఘానికి ఎన్నికైన కొత్త కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లోని ఎన్‌టీఆర్‌సీఎస్‌డీ (మహిళా ప్రాంగణం)లో నాలుగు నెలల పాటు నిర్వహించనున్న రెసిడెన్సియల్ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేనేజర్ పి.విమల చెప్పారు. కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ 10వ తరగతి ఉత్తీర్ణత, 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గలవారు ఈ నెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు ఫోన్ నంబర్లు 76800 29059, 90100 74289 సంప్రదించాలని అన్నారు.

### 'ప్రిస్క్రిప్షన్ లేనిదే పెయిన్ కిల్లర్స్ ఇవ్వవద్దు'



జాడుపూడి మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

కంచిలి: వైద్యుని ప్రిస్క్రిప్షన్ లేనిదే పెయిన్ కిల్లర్స్ ఇవ్వవద్దని మెడికల్ షాపుల నిర్వాహకులకు టెక్కలి డివిజన్ పరిధి డ్రగ్స్ ఏడి ఎం.చంద్రరావు స్పష్టం చేశారు. ఆయన ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఇచ్ఛాపురం, జాడుపూడి, కవిటి, పలాస, కాశీబుగ్గ ప్రాంతాల్లో గల మెడికల్ దుకాణాల్లో గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లో పెయిన్ కిల్లర్స్ నిల్వల వివరాలను నమోదు చేసుకొన్నారు. కిడ్నీ వ్యాధి విస్తరించడానికి పెయిన్ కిల్లర్స్ అధిక వాడకం కూడా ఓ కారణంగా భావించి, వీటి వినియోగం విచ్చలవిడిగా ఉండకూడదని ఈ చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



జగనన్న మహిళామార్ట్ ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మహిళల ఆర్థికాభివృద్ధే వైఎస్ జగన్ సర్కారు ధ్యేయమని మెప్మా రాష్ట్ర డైరెక్టర్ వి.విజయలక్ష్మి వెల్లడించారు. రైతు బజారు వద్ద ఏర్పాటు చేసిన జగనన్న మహిళామార్ట్‌ను ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళా వ్యాపార నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. సుస్థిరమైన జీవనోపాధి ఏర్పాటు చేసుకొని కుటుంబ జీవనం మెరుగుపరచుకునేందుకు జగనన్న మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ మార్ట్‌ల సాయంతో మహిళలు నిలదొక్కుకోవాలని తెలిపారు. స్థిరమైన ఆస్తిని మహిళా సంఘాలకు ఏర్పాటుచేసేందుకు 18,278 మహిళా సంఘ సభ్యులు ఒక్కొక్కరు రూ.150లు చొప్పున రూ.27.42లక్షలు వాటాధనంగా పెట్టుబడి పెట్టి జగనన్న మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం మెప్మా పీడీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఇచ్ఛాపురం, పలాస మున్సిపాలిటీల్లో జగనన్న మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. జగనన్న మహిళా మార్ట్‌లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మహిళలకు వివరించారు. కార్యక్రమంలో కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, పి.సుగుణారెడ్డి, చల్ల అలివేలుమంగ, ఎంఈ గంగాధర్, డీఈ రమణమూర్తి, పైడి మహేశ్వరరావు, కర్నేన పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## ● గేటు వద్ద ఫీట్లు






కాశీబుగ్గ ఎల్‌సీ రైల్వే గేటు వద్ద కొందరు వాహనదారులు ప్రమాదకర ఫీట్లు చేస్తున్నారు. ఇక్కడ గేటు పడే వేళకు ఎలాగైనా దాటేయాలనే అత్యుత్సాహంలో గేటు కిందకు దూరి వెళ్లడం, గేటు వేస్తుండగా మధ్యలోకి వెళ్లిపోవడం వంటి పనులకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా బైక్‌లపై వచ్చే వాళ్లతోనే ఈ ఇబ్బంది ఎదురవుతోందని రైల్వే సిబ్బంది చెబుతున్నారు.

– కాశీబుగ్గ

# భూదేవి ఒడిలో ధాన్యలక్ష్మి



ఇళ్ల ముందు ధాన్యం పాతర్లు

- నరిహద్దులో అక్కడక్కడా కనిపిస్తున్న పాత(ర)పద్ధతి

ఊరి దారులు రహస్యంగా దాచుకున్న కథలు కోకొల్లలు. నల్లటి తారు కప్పుకున్న రోడ్లు, తెల్లటి సిమెంటు రంగేసుకున్న బాటలు.. నిజానికి రహదారులు మాత్రమే కావు.. వేల జ్ఞాపకాలకు ద్వారాలు. పల్లెల్లో మట్టి రోడ్ల రోజులు గతించిపోతూ కొన్ని అలవాట్లను తమతో ఉంచేసుకున్నాయి. అలా నిన్నటి కాలం తనతో ఉంచేసుకున్న కథ 'పాతర'. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఆరు కాలాల పాటు నిల్వ ఉంచడానికి భూమి కడుపును ఆశ్రయించిన అన్నదాతల తెలివికి ప్రతీక ఇది. ధాన్యలక్ష్మి బాధ్యతను భూదేవికే అప్పగించారు. ఇచ్ఛాపురంలోని సరిహద్దు గ్రామాల్లో అక్కడక్కడా ఈ పాతర్లు ఇంకా దర్శనమిస్తున్నాయి. ధాన్యం నిల్వ ఉంచడానికి ఈరోజు అనేక పద్ధతులు ఉండవచ్చు. కానీ సాంకేతికత అనేదే లేని రోజుల్లో నెలల తరబడి ధాన్యం నిల్వ చేయడానికి మన పూర్వీకులు కనిపెట్టిన ఈ విధానం వారి విజ్ఞానానికి ఓ నిదర్శనం.

ఇచ్ఛాపురం రూరల్: పల్లె ఒడిలో పెరిగి పెద్దయిన వారికి.. గ్రామాల్లో బాల్యం గడిపిన వారికి పాతర్లు పరిచయమే. కానీ పట్టణీకరణ పెరిగి మట్టికి దూరమైపోతున్న ఈ తరానికి మాత్రం పాతర గురించి కచ్చితంగా తెలియాలి. పాతర వేయడం అంటే భూమిలో గొయ్యి తీసి దాచిపెట్టడం. ఒకప్పుడు ధాన్యం నిల్వ ఉంచడానికి ఎలాంటి సాధనం లేని రోజుల్లో భూమిలో ధాన్యం ఉంచే పద్ధతిని మన పూర్వీకులు అనుసరించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఆంధ్రా–ఒడిశా సరిహద్దు పల్లెల్లో ఇప్పటికీ ఇవి కనిపిస్తున్నాయి.

**అంత సులభం కాదు..**



పాతర వేసే ముందు ధాన్యం రాశికి పూజలు

- ఈ ధాన్యాన్ని పాతర వేయడం అంటే అనుకున్నంత సులువేం కాదు.
- పాతర వేయడానికి రైతుల ఇళ్ల ముందు వీధిలో ఉండే ఖాళీ స్థలాన్ని ఎంచుకొని వృత్తాకారంలో, దీర్ఘ చతురస్రాకారంలో నిల్వ చేయాల్సిన ధాన్యం రాశి పరిమాణానికి తగినట్లుగా గోతిని తవ్వుతారు.
- గోతిని కనీసం ఆరు అడుగుల లోతులో తవ్వడం పూర్తయ్యాక, వరి నూర్పులు సమయంలో వచ్చిన ఎండు గడ్డిని జడలా అల్లుతూ 'బెంటు'ను తయారు చేస్తారు.
- దాన్ని గోతిలో పేర్చి, అడుగు భాగంలో కొంటి గడ్డిని పొరలు పొరలుగా అమర్చుతారు.
- భారీ వర్షాలు కురిసినా నీరు గోతిలో చేరకుండా చాకచక్యంగా పై వరకు అమర్చుతారు.
- అందులో టార్పాలిన్లు గానీ, వలను గానీ వేసి ధాన్యంను వేస్తారు.
- అనంతరం ధాన్యంపై ఎండు గడ్డిని వేసి, దానిపై మట్టితో కప్పి ఆవు పేడతో శుభ్రంగా అలుకుతారు.



ధాన్యం నిల్వ కోసం తీసిన పాతర గొయ్యి



పాతరలో వల వేసి ధాన్యం వేస్తున్న రైతులు



మండపల్లి ప్రాంతంలో ఇళ్ల ముందు ధాన్యం పాతర్లు

**రక్షణ కోసం..**

ఒక్కసారి పాతర వేశాక.. ధాన్యం పోతుందన్న దిగులు రైతులకు ఇక ఉండదు. వానలు, దొంగలు, అగ్ని ప్రమాదాలు ఇలా ఏ వైపరీత్యం వచ్చినా పాతరే పంటను కాపాడుకుంటుంది. చాలా ఇళ్లలో ఈ పాతర్లకు ప్రతి గురువారం ప్రత్యేక పూజలు కూడా చేసేవారు. ఎప్పటికప్పుడు శుభ్రంగా పేడతో అలికి ముగ్గులు పెట్టి మురిపెంగా చూసుకునేవారు. బియ్యం కావాల్సిన సమయంలో తీసి మిల్లు చేసుకోవడమో దంచుకోవడమో చేసుకునేవారు. పాతర ధాన్యం తిన్న పిల్లలు పుష్టిగా ఉంటారని గ్రామీణ ప్రాంతాల్లో నానుడి ఉంది. పూర్వం గ్రామాల్లో ఉండే భూస్వాములు రెక్కలు ముక్కలు చేసుకొని పంటలు పండించేవారు. పంట దిగుబడి తనకే అధికంగా వచ్చిందనడానికి ప్రతీకగా తమ ఇళ్ల ముందు పాతర్ల రూపంలో తోటి రైతులకు తెలియజెప్పేందుకు వేసేవారని చెబుతారు.

**పుష్కలంగా పోషకాలు..**



పాతర్లలో నిల్వ చేసిన ధాన్యంలో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయి. ధాన్యం పరిమాణంలో కూడా తేడా వస్తుంది. పాతర్లలో నెలల తరబడి ఉండటంతో ధాన్యం భూగర్భంలో బాగా ముక్కుతాయి. ఇలాం ధాన్యం మిల్లులో వేసి బియ్యం చేయడం కన్నా, ఎండలో వేసి రోట్లో వేసి దంచిన తర్వాత వచ్చిన బియ్యాన్ని ఉపయోగిస్తే మరింత రుచికరంగా, ఆరోగ్యకరంగా ఉంటుంది. బియ్యంతో తయారైన ఆహారం తినడం వల్ల రక్తహీనత సమస్యలు దరికి చేరవు. ఇచ్ఛాపురం మండలంలో చాలా గ్రామాల్లో పాతర్ల పద్ధతిని కొనసాగిస్తుండటం గమనార్హం.

– పిరియా శ్రీదేవి, వ్యవసాయాధికారి, ఇచ్ఛాపురం మండలం

**ఇప్పటికీ పాతరే..**



గ్రామంలో సిమ్మెంట్ రోడ్లు వచ్చినా.. తరతరాలుగా వస్తున్న పాతర సంప్రదాయాన్ని ఇప్పటికీ మేము కొనసాగిస్తూనే వస్తున్నాం. రైతుల ఇళ్ల ముందు వేసిన పాతర ఎంత ఎత్తులో ఉంటే యజమాని ఎన్ని ఎకరాల భూస్వామిగా అప్పట్లో నిర్ధారించేవారు. అప్పట్లో రైతుకు మానసికంగా ఎన్ని కష్టాలు వచ్చినా, ఈ ధాన్యం పాతర చేసి కష్టాలను మరచిపోయేవారు. దొంగల భయం నుంచి, అగ్ని భయం నుంచి సురక్షితంగా ధాన్యం సంరక్షించుకునేందుకు చక్కని అవకాశం ఈ పాతర్లు.

– కొణతాల కనకయ్య, రైతు, తేలుకుంచి, ఇచ్ఛాపురం మండలం

## ● మెరైన్ పోలీసుల ఆధీనంలో మిలటరీ డ్రోన్



మండలంలోని భావనపాడు తీరంలో బుధవారం మత్స్యకారులకు దొరికిన మిలటరీ డ్రోన్‌ను భావనపాడు మెరైన్ సీఐ దేవుళ్లు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా గోపాల్‌పూర్‌లో జనవరి 27న యూజర్ ట్రైల్‌లో భాగంగా పైలెట్ ఎయిర్‌క్రాఫ్ట్ మిషన్ నుంచి ఈ డ్రోన్‌ను కొట్టడానికి నమూనాగా తయారు చేసి ప్రయోగించినట్లు బన్‌సీ కంపెనీ ప్రతినిధులు తెలియజేశారు. ఈ డ్రోన్‌ను 45 నిమిషాల్లో వైమానిక వాహనం ద్వారా ధ్వంసం చేయాలని, ఆ సమయంలో డ్రోన్‌లో ఇంధనం అయిపోవడంతో సముద్రంలో పడిపోయి భావనపాడు తీరానికి చేరిందని కంపెనీ ప్రతినిధులు నౌపడ పోలీసుల దృష్టికి తీసుకు వచ్చారు. వీటిని అప్పగించాలని బన్‌సీ కంపెనీ ప్రతినిధులు కోరగా డీఆర్‌డీఏ అధికారుల సమక్షంలో అందజేస్తామని తెలిపారు.

–సంతబొమ్మాళి

# రారండోయ్ వేడుక చూద్దాం

- రేపటి నుంచి వత్సవలస జాతర
- నాలుగు వారాల పాటు జరగనున్న రాజమ్మతల్లి పండగ



రాజరాజేశ్వరి దేవి

గార: జాము రాతిరి ప్రయాణం, వెన్నెల్లో జాగారం, వేకువల్లో సముద్ర స్నానం, వైభవంగా తల్లి దర్శనం .. వెరసి వత్సవలస జాతర. గార మండలంలోని వత్సవలస గ్రామ దేవత శ్రీరాజరాజేశ్వరి (రాజమ్మ తల్లి) జాతర శనివారం సాయంత్రం నుంచి ప్రారంభం కానుంది. లక్షలాది మంది యాత్రికులు వచ్చే ఈ జాతర నాలుగు వారాల పాటు జరుగుతుంది. దేవదాయ శాఖ గుర్తింపు లేకపోయినా భారీగా జనాలు వచ్చే అవకాశం ఉండడంతో సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, చుట్టు పక్కల గ్రామాల్లో ఇంటి దేవత రాజమ్మ తల్లి. భక్తులు తమ తొలి సంతానాన్ని ఇక్కడికి తీసుకువచ్చి దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకుంటారు. వంశోద్ధారకుల తల వెంట్రుక (పుట్టుకొప్పు)లను ఇక్కడ అమ్మవారికి సమర్పిస్తుంటారు. శనివారం సాయంత్రం ఇక్కడికి విచ్చేసి ఆదివారం ఉదయం అమ్మవారికి మొక్కులు తీర్చుకొని తన వెంట తీసుకువచ్చిన కోళ్లు, గొర్రెలను సమర్పిస్తుంటారు. అనంతరం ఇక్కడే వంటలు చేసుకుని విందు ఆరగించి తిరిగి ఇంటి ముఖం పట్టడంతో జాతర ముగుస్తుంది.

**150 మంది పోలీస్‌తో పటిష్ట బందోబస్తు**

యాత్రకు తొలివారం 150 మందితో పోలీసులతో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామని శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ ఎల్.సన్యాసినాయుడు తెలిపారు. యాత్రకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు.

ఎస్పీ ఆదేశాలతో వన్‌వే, వాహన పార్కింగ్, గస్తీ పార్టీ ఏర్పాటు చేశామన్నారు. వత్సవలస ప్రాథమిక పాఠశాలలో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామన్నారు.

**నాలుగు వారాల జాతర..**

గ్రామంలో సుమారు 25 పీఠాలుండగా, ప్రధానంగా ఐదు ప్రధాన పీఠాల వద్ద సంబరాలు జరుగుతుంటాయి. ప్రధానంగా ఒక కుటుంబం వద్ద ఉన్న రాజమ్మతల్లి వద్ద నాలుగు వారాలు పూజలు చేస్తారు. అయితే అన్ని పీఠాల వద్ద భక్తులు వచ్చి దర్శనం చేసుకుంటారు. అదేవిధంగా భూలోకమ్మ తల్లిని భక్తులు దర్శించుకుంటారు.

**వన్‌వే ఏర్పాటు..**

వత్సవలస జాతర సందర్భంగా వరుసగా శని, ఆది వారాల్లో శ్రీకాకుళం నుంచి వచ్చే వాహనాలను శ్రీకూర్మం కూడలి మీదుగా తూలుగు నుంచి వత్సవలస వరకు వన్‌వేను పోలీసులు ఏర్పాటు చేశారు. తిరుగు ప్రయాణంలో శ్రీకూర్మం మీదుగా శ్రీకాకుళం వెళ్లేందుకు వన్‌వే ఉంటుందని పోలీసులు తెలిపారు.

# పోరాట ఫలితమే విశాఖ రాజధాని

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: ప్రజా పోరాటాలతోనే విశాఖపట్నం రాజధానిగా ఏర్పాటు చేసుకోబోతున్నామని రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండలంలోని డిమిరియా గ్రామంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ రాజధాని ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ అని అన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాకే విశాఖ రాజధాని ప్రక్రియ ఊపందుకుందన్నారు. విశాఖ రాజధానితో ఉత్తరాంధ్రతో పాటు విశాఖపట్నం రూపురేఖలు మారబోతున్నాయని, అన్ని హంగులతో అభివృద్ధి దిశగా విశాఖను ప్రభుత్వం తీర్చిదిద్దుతుందన్నారు. మూడు రాజధానులతో ఏపీ అభ్యున్నతి చెందుతుందని అన్నారు.



డిమిరియాలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

విశాఖను రాజధానిగా చూడడం ఇష్టం లేని చంద్రబాబు పెయిడ్ ఆర్టిస్టులు, టీడీపీ నాయకులతో ర్యాలీలు, ఆందోళనలు చేశారని ఆరోపించారు. అమరావతి ఆయన సామాజిక వర్గం, టీడీపీ నాయకులతో భూములు కొనిపించి, భ్రమరావతిని వారి వ్యాపార కేంద్రంగా మార్చడానికి ప్రయత్నించారన్నారు. రియల్ ఎస్టేట్ కేంద్రంగా తయారు చేసి, రూ.కోట్లు గడించుకోవడానికి చేసిన పన్నాగాలు ఫలించకపోవడంతో కుటిల యత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లో చంద్రబాబు నాటకాలను కొనసాగివ్వబోమని హెచ్చరించారు. రాబోయే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. టీడీపీకి వచ్చే ఎన్నికల్లో రెండు మూడు సీట్ల కంటే ఎక్కువ రాదని జోస్యం చెప్పారు. కేంద్రానికి తప్పుడు ఫిర్యాదులు చేస్తూ చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నాడని విమర్శించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సీర ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మంత్రి అప్పలరాజు పార్టీ కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు.

### 4న డయల్ యువర్ యూనివర్సిటీ

ప్రతి నెల మొదటి శనివారం నిర్వహించే డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమం ఈ నెల 4న నిర్వహించనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ చెప్పారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. ఫోన్ ఇన్ లైవ్ కార్యక్రమంలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఉంటుందని, విద్యార్థులు తమ సమస్యలు దృష్టికి తీసుకురావడం, కోర్సుల వివరాలు తెలుసుకోవటం కోసం 82478 61919 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

–ఎచ్చెర్ల క్యాంపస్

### 94.28 శాతం పింఛన్ల పంపిణీ



జిల్లాలో గురువారం సాయంత్రానికి 94.28 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశారు. మొత్తం 3,17,072 పింఛన్లకు గాను ఇప్పటి వరకు 2,98,933 మందికి అందజేశారు. ఇంకా 18,139 మందికి పింఛన్లు అందజేయాల్సి ఉంది. – శ్రీకాకుళం పాతబస్టాండ్

### శాలిహుండం యాత్ర ఆదాయం రూ. 7,79,248



భీష్మ ఏకాదశిన జరిగిన శాలిహుండం గిరి యాత్ర హుండీల ఆదాయం రూ.7,79,248లు వచ్చిందని ఆలయ ట్రస్టీ సుగ్గు మధు రెడ్డి తెలిపారు. దేవదాయ శాఖాధికారులు కోదండ, శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, రామచంద్ర రావుల సమక్షంలో హుండీలను తెరచి లెక్కించారు. కార్యక్రమంలో అర్చకులు వేణుగోపాలచార్యులు, అచ్యుతరావు, తాన్నె రాజారావు. గురయ్య పాల్గొన్నారు.

– గార

### అనకాపల్లి టు కాశీ



అనకాపల్లి నుంచి కాశీ వెళ్లేందుకు నలుగురు భక్తులు పాదయాత్ర చేస్తున్నారు. వీరు గురువారం కవిటి మండలంలో స్థానికులతో ముచ్చటించారు. లక్ష్మణమూర్తి, దొంతికుర్తి స్వర్ణనాగేశ్వరరావు, వంకలంక శేషగిరి రావు, బొలిశెట్టి కొండగబాబు అనే నలుగురు భక్తులు ఈ పాదయాత్ర చేస్తున్నారు. ప్రతి రోజు వేకువజామున నాలుగు నుంచి పదిగంటల వరకు పదిహేను కిలోమీటర్లు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు పది కిలోమీటర్లు నడుస్తున్నామని తెలిపారు. శుక్రవారం నుంచి ఒడిశాలో నడక ప్రారంభం కానుందన్నారు.

–కవిటి

## క్లుప్తంగా

### నేడు వైస్ ఎంపీపీ ఎన్నిక

గార: గార మండల ప్రజా పరిషత్ వైస్ ఎంపీపీ ఎన్నిక శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించనున్నామని ఎంపీడీఓ శిమ్మ రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. వైస్ ఎంపీపీ బరాటం రామశేషు మరణం కారణంగా ఖాళీ అయిన స్థానానికి ఎన్నిక జరగనుందని పేర్కొన్నారు.

### వైఎస్సార్‌సీపీ యువజన నేత మృతి


ధర్మాన రామ్‌భరత్ నాయుడు (ఫైల్)

పోలాకి: ధర్మాన సోదరుల్లో ఒకరైన దివంగత ధర్మాన వాసుదేవరావు కుమారుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు ధర్మాన రామ్‌భరత్‌నాయుడు (37) గురువారం ఉదయం విశాఖపట్నంలో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మరణవార్త తెలియగానే ధర్మాన కుటుంబసభ్యులు, అభిమానుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. స్వగ్రామం మబగాంలో ధర్మాన సోదరులు, కుటుంబసభ్యులు, బంధువులు, అభిమానులు, పార్టీ నాయకుల సమక్షంలో రాంభరత్ అంత్యక్రియలు నిర్వహించారు.

### ఆస్పత్రి ప్రసవాలు పెరగాలి


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

జలుమూరు: ఆస్పత్రిలో ప్రసవాలు పెరిగేందుకు మెడికల్ అధికార్లు, సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి సూచించారు. గురువారం అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు నిర్వహించి సిబ్బందితో సమీక్షించారు. గర్భిణులు, చిన్నారులు రక్తహీనత అధిగమించేందుకు సరైన పౌష్టికాహారం, మందులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది ముఖహాజరు కచ్చితంగా వేయాలని సూచించారు. అనంతరం శిశువుల వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ సంక్షేమ లక్ష్యాలు, ఆస్పత్రి అభివృద్ధి నిధులు, నాడు-నేడు పనులపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యులు పూజారి సుజాత, కొయ్యాన అప్పారావు, సీసీ కె.వి.నారాయణ, ఆరోగ్య విస్తరణ అధికారి శిమ్మ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి వేతనదారుకు గాయాలు

మెళియాపుట్టి: మండలంలో సంతలక్ష్మీపురం గ్రామానికి చెందిన దైల ఇంద్రవేణి(54) పక్క గ్రామమైన గుడ్డిభద్రలో ఎర్ర చెరువు వద్ద గురువారం ఉపాధి పనిచేస్తుండగా గట్టెక్కుతూ జారి పడింది. ఈ ఘటనలో కుడికాలు విరగడంతో హుటాహుటిన పూండిలోని ఓ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. విషయాన్ని గ్రామ సర్పంచ్ బమ్మిడి చామంతి ద్వారా ఉపాధి అధికారులకు తెలియజేసినట్లు క్షేత్ర సహాయకుడు సోమయ్య తెలిపారు.

### కలాసీల ధర్నా


ధర్నా చేస్తున్న కలాసీలు

కోటబొమ్మాళి: వేతనాలు పెంచాలంటూ కోటబొమ్మాళి మండలం నారాయణవలసలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాంలో పనిచేస్తున్న 80 మంది కలాసీలు గురువారం ధర్నా చేపట్టారు. పక్క గ్రామమైన రాయిపాడు గోదాంలో లారీ నుంచి టన్ను బరువు గల బస్తాలను దించేందుకు రూ.100 చొప్పున అక్కడి కాంట్రాక్టర్ ఇస్తుండగా.. నారాయణవలసలో మాత్రం టీడీపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సోదరుడైన గోదాం కాంట్రాక్టర్ కింజరాపు హరివరప్రసాద్ టన్నుకు రూ.75 మాత్రమే ఇస్తున్నారని కలాసీలు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పనికి వెళ్లకుండా నిరసన వ్యక్తం చేశారు. దీంతో కాంట్రాక్టర్ స్పందించి రూ.100 చొప్పున చెల్లించేందుకు అంగీకరించడంతో కలాసీలు తిరిగి విధుల్లోకి చేరారు.

### బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24క్యా. 10గ్రా.) | 54,930-00 |
| బంగారం(22క్యా. 10గ్రా.) | 50,350-00 |
| వెండి (కిలో) | 74,500-00 |

### కోడిగుడ్ల ధరలు

| హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు) | |
|---|---|
| విశాఖపట్నం | రూ. 547.00 |
| విజయనగరం | రూ. 551.00 |
| శ్రీకాకుళం | రూ. 551.00 |

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹120 | ₹195 | ₹ 215 |

# ఆట అదరహో..!

- ఉత్కంఠగా సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు
- సీనియర్స్‌లో సెమీస్‌కు దూసుకెళ్లిన ఐతమ్-ఏ టీం, రిమ్స్ మెడికల్ కాలేజ్
- నేటి నుంచి జూనియర్స్ విభాగంలో పోరు ఆరంభం


సీనియర్స్ విభాగంలో టెక్కలి ఐతమ్ బీ - శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ మధ్య పోటీ


రనౌట్ చేస్తున్న బౌలర్

శ్రీకాకుళం న్యూకాలనీ:

ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నీ తుది దశకు చేరుకుంది. సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆద్యంతం ఉత్కంఠను తలపిస్తున్నాయి. లీగ్ దశ ముగిసి క్వార్టర్స్ ఫైనల్స్ మ్యాచ్‌లు జరుగుతుండటంతో హోరాహోరీగా సాగుతున్నాయి. గత నెల 31న ప్రారంభమైన ఈ టోర్నీ ఈ నెల 4తో ముగియనుంది. మూడో రోజు గురువారం 6 మ్యాచ్‌లు జరిగాయి. సీనియర్స్ విభాగంలో ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్-ఏ టీం, రిమ్స్ మెడికల్ కాలేజ్ శ్రీకాకుళం జట్లు సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లాయి. మరో రెండు క్వార్టర్స్ ఫైనల్స్ మ్యాచ్‌లు జరగాల్సి ఉన్నాయి. ఆ మ్యాచ్‌ల్లో విజయాలు సాధించిన మరో రెండు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. సాక్షి మీడియా శ్రీకాకుళం యూనిట్ ప్రతినిధులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

**జూనియర్స్ పోటీలకు ఏర్పాట్లు..**

ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నీలో జూనియర్స్ విభాగంలో మ్యాచ్‌లు శుక్రవారం నుంచి మొదలుకానున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను, మ్యాచ్‌ల జరిగే సమయాలను ఆయా కళాశాలల జట్లకు చేరవేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

**ఏ గ్రౌండ్‌లో మ్యాచ్‌లు జరిగాయిలా..**

**రిమ్స్ విజయభేరి :** ఉదయం శ్రీకాకుళం కాకినాడ ఆదిత్య డిగ్రీ కాలేజ్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీకాకుళం రిమ్స్ మెడికల్ కాలేజ్ జట్టు 9 వికెట్ల తేడాతో విజయభేరి మోగించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కాకినాడ ఆదిత్య 41 పరుగులు చేయగా, ప్రతిగా బ్యాటింగ్ ప్రారంభించిన రిమ్స్ కాలేజ్ ఒక వికెట్ కోల్పోయి విజయాన్ని అందుకుంది. దీంతో రిమ్స్ మెడికల్ క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది.

**'ఆర్ట్స్ కాలేజ్' అద్భుత ప్రదర్శన..**

టెక్కలి ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్-బీ టీంతో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్ కాలేజ్) జట్టు 3 పరుగుల తేడాతో విజయం సాధించి క్వార్టర్‌ఫైనల్స్‌కు ప్రవేశించింది. టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన ఆర్ట్స్ కాలేజ్ జట్టు నిర్ణీత 8 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 89 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన టెక్కలి ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్-బీ టీం 86 పరుగులు మాత్రమే చేయగలిగింది.

**బీ గ్రౌండ్ మ్యాచ్‌లు ఇలా..**

**'ఆదిత్య' డిగ్రీ అదుర్స్..:** శ్రీకాకుళం రూరల్ గాయిత్రి డిగ్రీ కాలేజ్- ఏ టీంతో జరిగిన మ్యాచ్‌లో శ్రీకాకుళం ఆదిత్య డిగ్రీ కాలేజ్- ఏ జట్టు 8 వికెట్లతో విజయబావుటా ఎగురవేసింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన గాయిత్రి కాలేజ్-ఏ జట్టు నిర్ణీత 8 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి 56 పరుగులు చేసింది. బదులుగా బరిలోకి దిగిన ఆదిత్య డిగ్రీ కాలేజ్ -ఏ టీం జట్టు కేవలం 6.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి విజయాన్ని నమోదు చేసింది.

**'శివానీ' జయభేరి**

మధ్యాహ్నం శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజ్-బీ టీంతో జరిగిన ఉత్కంఠ పోరులో శ్రీ శివానీ ఇంజనీరింగ్ కాలేజ్ జట్టు 9 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. తొలుత టాస్ ఓడి బాట్యింగ్ ప్రారంభించిన శ్రీ వెంకటేశ్వర జట్టు నిర్ణీత 8 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేసింది. బదులుకు బరిలోకి దిగిన శివానీ ఇంజనీరింగ్ కాలేజ్ ఆటగాడు దువ్వల కులశేఖర(45 పరుగులు) రాణింపుతో 7.2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి విజయాన్ని అందుకుంది.

### 'రిమ్స్ మెడికల్' సెమీస్‌కు..


సెమీస్‌కు చేరిన రిమ్స్ మెడికల్ కాలేజ్ శ్రీకాకుళం జట్టు

మధ్యాహ్నం శ్రీకాకుళం శ్రీ సాయి డెంటల్ కాలేజ్‌తో జరిగిన రెండో క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లో శ్రీకాకుళం రిమ్స్ మెడికల్ కాలేజ్ జట్టు 13 పరుగులతో విజయం సాధించి సెమీస్‌లో అడుగుపెట్టింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన రిమ్స్ కాలేజ్ నీర్ణత 8 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 66 పరుగులు చేసింది. ప్రతిగా బ్యాటింగ్ ప్రారంభించిన సాయి డెంటల్ కాలేజ్ 53 పరుగులకే పరిమితమైంది.

### సెమీస్‌లో 'ఐతమ్'..


సెమీస్‌కు దూసుకెళ్లిన ఐతమ్ టెక్కలి-ఏ టీం టెక్కలి జట్టు

అనంతరం శ్రీకాకుళం ఆదిత్య పీజీ కాలేజ్-బీ టీంతో జరిగిన మ్యాచ్‌లో ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్ (ఐతమ్)- ఏ టీం 32 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన ఐతమ్ నాయుడు (56 పరుగులు) అర్ధసెంచరీతో రాణించడంతో నిర్ణీత 8 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 96 పరుగులు చేసింది. ప్రతిగా బ్యాటింగ్ మొదలుపెట్టిన ఆదిత్య పీజీ కాలేజ్- బీ టీం 64 పరుగులకే పరిమితమైంది. దీంతో ఐతమ్ కళాశాల సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది.

### ఎస్‌పీఎల్ నేటి మ్యాచ్‌లు ఇలా..

శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా ఏ, బీ రెండు గ్రౌండ్‌లలో శుక్రవారం మొత్తం 7 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో సీనియర్స్‌కు నాలుగు, జూనియర్స్‌కు మూడు మ్యాచ్‌లు చొప్పున నిర్వహించనున్నారు. నిర్దేశిత సమయానికి మైదానం వద్ద రిపోర్ట్ చేయాలని నిర్వాహకులు సూచిస్తున్నారు.

**ఏ-గ్రౌండ్ (సీనియర్స్‌కు)**

-3వ క్వార్టర్‌ఫైనల్స్ మ్యాచ్.. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల శ్రీకాకుళం - ఆదిత్య డిగ్రీ కాలేజ్-ఏ టీం శ్రీకాకుళం (ఉ.8 గంటలకు)

- 4వ క్వార్టర్‌ఫైనల్స్ మ్యాచ్.. సన్ డిగ్రీ కాలేజ్ శ్రీకాకుళం - శివానీ ఇంజనీరింగ్ కాలేజ్ చిలకపాలెం (ఉ.10),

-మొదటి సెమీఫైనల్స్ మ్యాచ్‌లో.. 3వ క్వార్టర్‌ఫైనల్స్ మ్యాచ్‌లో విజేత (శ్రీకాకుళం ఆర్ట్స్‌కాలేజ్/ఆదిత్య డిగ్రీ కాలేజ్ -ఏ టీం)తో శ్రీకాకుళం రిమ్స్ మెడికల్ కాలేజ్ మధ్యాహ్నం 1.30కి తలపడనుంది.

-రెండో సెమీఫైనల్స్ మ్యాచ్‌లో.. 4వ కార్వర్‌ఫైనల్స్ మ్యాచ్‌లో విజేత (సన్ డిగ్రీ కాలేజ్/శ్రీ శివానీ ఇంజనీరింగ్ కాలేజ్)తో ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్-ఏ టీం టెక్కలి పోటీపడనుంది. ఈ మ్యాచ్ బీ -గ్రౌండ్‌లో 1.30 గంటలకు మొదలుకానుంది.

**బి-గ్రౌండ్‌లో: (జూనియర్స్)**

1. ఐతమ్ పాలిటెక్నిక్ కాలేజ్ టెక్కలి - శ్రీ ఆదిత్య జూనియర్ కాలేజ్ శ్రీకాకుళం (ఉ.8గంటలకు).
2. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ శ్రీకాకుళం - ప్రభుత్వ జూనియర్ కాలేజ్ పలాస (ఉ.9.30).
3. మొదటి మ్యాచ్ విజేత (ఐతమ్ పాలిటెక్నిక్/శ్రీ ఆదిత్య కాలేజ్)- ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల శ్రీకాకుళం(ఉదయం 11 గంటలకు)

# శ్రీకాకుళం టీపీఓ సీతారాంపై చర్యలు

- సర్వీస్ నుంచి విత్‌డ్రా చేస్తూ ఉత్తర్వులు జారీ
- టౌన్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టరేట్‌కు రిపోర్టు చేయాలని ఆదేశం
- ముగ్గురు ఎల్‌టీపీలకు అనుకూలంగా ఉండటమే కారణం


జి.సీతారాం, టీపీఓ

శ్రీకాకుళం/శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళం టౌన్ కంట్రీ ప్లానింగ్ అధికారి జి.సీతారాం అవినీతిపై ఫిర్యాదులు రావడంతో సర్వీసెస్ నుంచి విత్‌డ్రా చేస్తూ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి ఆర్.జె.విద్యుల్లత గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఎం.చాణుక్య అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. సీతారాం శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో మూడేళ్లగా పనిచేస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో 30 మంది లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లు (ఎల్‌టీపీ) ఉండగా అందులో గుడ్ల శ్రీనివాస్, బెహరా శశికాంత్, బాకి సురేష్‌లకే 500కు పైగా ప్లాన్‌లు అప్రూవల్ ఇవ్వడం, మిగిలిన 27 మందికి 200 మాత్రమే ప్లాన్‌లు అప్రూవల్ చేసినట్లు ఫిర్యాదు రావడం, అవన్నీ రుజువుకావడంతో సర్వీస్ నుంచి విత్‌డ్రా చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలో అనేకమంది నిర్మాణదారులు స్వతహాగా ప్లాన్‌లకు దరఖాస్తు చేసుకున్నప్పుడు అన్నీ సరిగ్గా ఉన్నా ఏదో కొర్రీతో నెలల తరబడి అప్రూవల్ చేయకుండా వదిలేసేవారని తెలుస్తోంది. ఈయన్ను సర్వీస్ నుంచి విత్‌డ్రాతో సరిపెట్టేయకుండా భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృతం కాకుండా టౌన్ ప్లానింగ్ మీద నమ్మకం రావాలంటే టీపీఓపై, ఆయన అత్యధికంగా ప్లాన్‌లు ఇచ్చిన ఎల్‌టీపీలతో జరిగిన లావాదేవీలను పరిశీలించి సమగ్ర దర్యాప్తు చేస్తే మరిన్ని వాస్తవాలు బయటపడే అవకాశం ఉందని మిగిలిన ఎల్‌టీపీలు కోరుతున్నారు. ప్లాన్‌కు దరఖాస్తు చేసుకుంటే అన్నీ సక్రమంగా ఉంటే కనీసం రూ.10వేలు, ఆపై నిర్మాణదారులు వేసుకునే ఫ్లోర్లు, విస్తీర్ణం బట్టి లక్షల్లో అక్రమ వసూళ్లు ఆ ముగ్గురి నుంచి జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి.

# 9 వరకు ఉపాధి హామీ పనుల పరిశీలన


మాట్లాడుతున్న కేంద్ర పరిశీలన బృందం సభ్యులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్న తీరును గురువారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు మొత్తం ఎనిమిది రోజుల పాటు పరిశీలించనున్నట్లు జాతీయ స్థాయి పరిశీలన బృందం సభ్యులు గిరిజ శంకర్ పాడి, సత్యనారాయణ రౌత్‌లు, తెలియజేశారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో (డ్వామా)కి వచ్చిన వీరు గురువారం ప్రాజెక్టు డైరెక్టర్, అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశీలన బృందం సభ్యులు గిరిజ శంకర్ పాడి, సత్యనారాయణ రౌత్ మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో ఉపాధి హామీ పథకం ప్రాథమిక లక్ష్యాలు ఎంత మేర అమలు జరుగుతున్నాయో పరిశీలించి ఆ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. వాటర్ షెడ్ పథకంతో పాటు ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా జిల్లాలో చేపడుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ చిట్టిరాజు మాట్లాడుతూ, జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరచడం, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం, సుస్థిర వనరులు సృష్టించడం, భూగర్భ జలమట్టాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెద్ద ఎత్తున పనులను చేపడుతున్నట్లు తెలియజేశారు. సమావేశంలో పరిపాలనాధికారి ప్రసాదరావు, ఫైనాన్స్ మేనేజర్ స్వరూప రాణి, ఏపీడీలు హరిత, లోకేష్, రవి, సూపరిండెంట్లు ఎం రవికుమార్, శ్రీనివాస్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### సారా ప్యాకెట్లతో ఇద్దరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న సారా ప్యాకెట్లతో పోలీసులు

కంచిలి: మండలంలోని జాడుపూడి గ్రామానికి చెందిన పిలక చంద్రయ్య, పుల్లేటికుర్తి మన్మధరావులు ఒడిశా నుంచి తీసుకొచ్చిన నాటుసారా ప్యాకెట్లను గురువారం అమ్మడానికి సిద్ధంగా ఉండగా కంచిలి ఎస్‌ఐ ఎస్. చిరంజీవి, సిబ్బంది పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 65 ప్యాకెట్లు చొప్పున సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా పరిధి సి.సర్దాపూర్ నుంచి కొనుగోలు చేసి ఇక్కడ అధిక ధరలకు అమ్ముతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదుచేసి, అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# ఉత్తరాంధ్ర పురావస్తు వాయిద్యాల సేకరణ


సిక్కోలు గిరిజనుల వాయిద్య పరికరాన్ని పరిశీలిస్తున్న జయధీర్ తిరుమలరావు(ఫైల్)

పలాస: ఉత్తరాంధ్రలో గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టి కనుమరుగవుతున్న ప్రాచీన వస్తువులు, సంగీత వాయిద్యాలు సేకరిస్తున్నట్టు గిడుగు రామ్మూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బద్రి కూర్మారావు తెలిపారు. ఆద్య కళ పరిశోధకులు ప్రొఫెసరు జయధీర్ తిరుమలరావు(హైదరాబాద్)తో కలిసి పలాస మండలం ఉద్దానం ప్రాంతంలోని బొడ్డపాడు, రంగోయి, పలాస తదితర ప్రాంతాల్లో ఇటీవల పర్యటించారు. ప్రాచీన ఇత్తడి వస్తువులు, నాణేలు, కత్తులు, రైతులు ఉపయోగించిన గూడ, బుర్ర, గిడుగు, చిన్నపాటి వెదురు బుట్టలు, జముకు, తుడుం, దీపపుబుడ్లు, సునపకాయలు, చెక్క బొంగరాలు సేకరించారు. పార్వతీపురం రచయత జగదీశ్వరరావు ద్వారా గిరిజన వాయిద్యాలైన కిన్నెర, చిన్న కిన్నెర మెట్లను పరిశీలించారు. వీటన్నిటిని హైదరాబాద్ మ్యూజియంలో భద్రపరుస్తామని జయధీర్ తిరుమలరావు చెప్పారు. బద్రి కూర్మారావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో తాళపత్ర గ్రంథాలు, శాసనాలు, పటం కథలు, చేతి రాతలు, ఆదివాసీల వాయిద్యాలైన పిన్నెల కర్ర, కిన్నెర, తుడుం వంటి వాయిద్యాలను భద్రపరచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. త్వరలోనే ఉత్తరాంధ్ర గ్రామీణ సంస్కృతి పేరుతో ఒక పుస్తకం తీసుకొస్తామని చెప్పారు.

### కుక్కల దాడిలో చుక్కల జింక మృతి


మృతి చెందిన చుక్కల జింక

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని దుర్గమ్మకాలనీ శివారు ప్రాంతంలో గురువారం ఉదయం చుక్కల జింకపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. ఉదయం జోగి కొండ నుంచి దుర్గమ్మకాలనీ శివారు ప్రాంతంలోకి చుక్కల జింక వచ్చేసింది. అయితే కుక్కలు వెంబడించడంతో జింకకు తీవ్ర గాయాలై ఊపిరి వదిలేసింది. మృతి చెందిన జింకను పశుసంవర్ధకశాఖ వైద్యుడు పి.అనిల్ కుమార్ పోస్టుమార్టం చేసి, అనంతరం అటవీ శాఖ కార్యాలయం ఆవరణలో దహనం చేశారు.

### 25, 26 తేదీల్లో ఇఫ్టూ మహాసభలు


మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) 9వ రాష్ట్ర మహాసభలను ఈ నెల 25, 26వ తేదీల్లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పి.ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లు ప్రకటించారు. శ్రీకాకుళం నగరంలోని ఏపీ ఎన్‌జీఓ కార్యాలయంలో ఇఫ్టూ జిల్లా కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 7వ అఖిలభారత ఇఫ్టూ మహాసభలను తిరుపతిలో ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో నిర్వహిస్తున్న నేపథ్యంలో ముందుగా రాష్ట్ర మహాసభలను శ్రీకాకుళంలో నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు మామిడి క్రాంతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, ఏపీటీఎఫ్ ఉభయ తెలుగు రాష్ట్రాల పూర్వాధ్యక్షులు సన్నశెట్టి రాజశేఖర్, ఏఐకెఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాష్, ఇఫ్టూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేతింటి నీలంరాజు పాల్గొన్నారు.

# ఆర్టీసీ పురోభివృద్ధికి తోడ్పడాలి


అత్యుత్తమ డ్రైవర్‌కు బహుమతి అందజేస్తున్న జోనల్ ఈడీ రవికుమార్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ అంటే ప్రయాణికుల భద్రతకు భరోసా వంటిదని, అటువంటి సంస్థ పురోభివృద్ధికి అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది తోడ్పాటునందించాలని విజయనగరం జోన్ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ సీహెచ్.రవికుమార్ అన్నారు. ఆర్టీసీ 34వ రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సమావేశం గురువారం శ్రీకాకుళం రెండవ డిపో గ్యారేజీ ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ఏకాగ్రతతో రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషిచేయాలన్నారు. సంస్థలో అత్యుత్తమ డ్రైవింగ్ చేసిన అవార్డు గ్రహీతలను మిగతా డ్రైవర్లు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఉపరవాణాశాఖ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ ప్రజలకు సురక్షిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించి సంస్థలో ప్రమాదాల శాతాన్ని తగ్గించేందుకు డ్రైవర్లు కృషి చేయాలన్నారు. డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లు ఆర్.ఎన్.రావు, బి.వి.ఆర్.మూర్తి, పి.వి.రావు, ఎస్.పురుషోత్తం, వై.జి.రావు, డి.వి.రాజు, కె.రమణ, యూ.ఎ.రావు, కె.ఎస్.పి.రావు, కె.జె.రావు, జె.ఎల్.నారాయణ, డి.ఎం.రావు, ఎంకె. సాహు, టి.కె.వి.రావు, యూ.కె.రావులకు ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఐ గంగాధర్, డీపీటీఓ విజయకుమార్, డీసీఈ కె.శ్రీనివాసరావు, అప్పలనారాయణ, వర్క్స్ మేనేజర్ వరలక్ష్మి, ఏఎంఈ టైర్స్ టి.కవిత, శ్రీకాకుళం ఒకటి, రెండో డిపో మేనేజర్లు కె.మాధవ్, కెఎస్‌ఆర్ శర్మ, ఆర్టీసీ అధికారులు శ్రీనివాస్, ఎల్ఎస్ నాయుడు, కె.సుమన్, వి.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

### కాంప్లెక్సులో వ్యక్తి మృత్యువాత


మృతి చెందిన రాంబాబు

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్సులో ఓ వ్యక్తి అనారోగ్యంతో మృత్యువాత పడ్డాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపిన వివరా ల ప్రకారం.. గురువారం ఉదయం 8 గంటలకు కాంప్లెక్సు వద్ద హఠాత్తుగా ఓ వ్యక్తి కుప్పకూలడం అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డు చూసి ఆర్టీసీ బస్ డిపో మేనేజరుకు సమాచా రం చేరవేశారు. అంతకుముందు వేకువఝామున నాలుగు గంటలకు స్వీపర్లు చూసేటప్పుడు బాగానే ఉన్నాడన్న సమాచారం తెలుసుకున్న డిపో మేనేజరు రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. మొదట గుర్తు తెలియ ని వ్యక్తి మృతి కింద కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టగా.. మృతి చెందిన వ్యక్తి రణస్థలం మండల కేంద్రం వెంకటేశ్వర కాలనీకి చెందిన ఇలకల రాంబాబు(45)గా గుర్తించారు. ఇతనికి భార్య మంగమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాంబాబు కూలి పనులు చేస్తూ వచ్చే డబ్బులతో జీవనం సాగిస్తున్నాడని.. ఫిట్స్, ఫైల్స్ వ్యాధి ఉండటంతో చనిపోయివుంటాడని బంధువులు భావిస్తున్నారు.

### తహసీల్దార్‌పై లైంగిక వేధింపుల కేసు

సోంపేట: సోంపేట తహసీల్దార్ ఎన్.రమేష్‌పై లైంగిక వేధింపుల కేసు గురువారం నమోదు చేసినట్లు సోంపేట ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోంపేట పంచాయతీ మొగిలి కొత్తూరుకు చెందిన మీసాల ఉషారాణికి సోంపేటలో స్థలం ఉంది. స్థలానికి అడంగల్ కాపీలు రాకపోవడంతో ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ తహసీల్దార్‌ను కలవమని సూచించగా.. ఆమె రమేష్‌ను కలిసి సమస్య విన్నవించారు. అయితే స్థలం సమస్య పరిష్కరించడానికి తహసీల్దార్ లైంగికంగా వేధింపులకు గురి చేసినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె చేసిన ఫిర్యాదు మేరకు సోంపేట ఎస్‌ఐ బాలరాజు కేసు నమోదుచేశారు.